# సద్గురు బోధలో జగద్గురు గీత

## 4వ ఆధ్యాయం

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్
Regd. 192/2019



## సద్గురు బోధలో జగద్గురు గీత

## 4వ అధ్యాయం

"ఇతర సాధనాలతో కష్టపడనవసరం లేదు. శ్రీ సాయి చరిత్ర విని, మనం గతంలో చేసిన, ఇప్పుడు చేస్తున్న చెడుల ప్రభావం ఏ మాత్రం లేకుండా చేసుకుందాం" అని ఒక సాయి భక్తుడు ప్రవచించారు. నాలుగవ అధ్యాయం మొదట్లోనే మనకు అది గోచరిస్తుంది. ఈ అధ్యాయం ముఖ్యంగా భగవద్గీత లోని అ.4 శ్లోకం 7 & 8 తో మొదలు అవుతోంది.

యదా యదా హి ధర్మస్య

గ్లానిర్భవతి భారత ।

అభ్యుత్థానమధర్మస్య

తదాత్మానం సృజామ్యహమ్ ।।

గీత 4- 7 ।।

ఎప్పుడెప్పుడైతే ధర్మము క్షీణించునో, అధర్మము ప్రబలునో, ఓ అర్జునా, ఆ సమయంలో నన్ను నేను భూలోకంలో సృజించుకుంటాను.

పరిత్రాణాయ సాధూనాం

వినాశాయ చ దుష్కృతామ్ ।

ధర్మసంస్థాపనార్థాయ

సంభవామి యుగే యుగే ।।

గీత 4- 8 ।।

ధర్మాత్ములను కాపాడటానికి, దుష్టులను నిర్మూలించటానికి, మరియు ధర్మ సూత్రములను తిరిగి స్థాపించటానికి నేను ఈ లోకంలో ప్రతి యుగము నందు అవతరిస్తాను. ఈ రెండు శ్లోకాల విషయం లో హేమాడ్ పంతు తన వివరణని బాబా వారి బాధగా తెలియచేస్తూ చాతుర్వర్ణాల

గురించి, ధర్మం గురించి ప్రస్తావించారు. ఇక్కడ భగవత్ సృష్టి అయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల విషయంలో మనుస్మృతి చెప్పిన ఒక సూత్రం గుర్తు చేసుకోవాలి.

"జన్మనా జాయతే శూద్రః
కర్మణా జాయతే ద్విజః"

"పుట్టుకతో ఎవడైనా శూద్రుడే; చేసే పనుల (కర్మలు) ద్వారా
మాత్రమే ద్విజుడౌతాడు" అని అర్థం.

ఈ విభజన వారి వారి గుణాలని బట్టి విభజనే కాని జన్మతః కాదని అర్థం చేసుకోవాలి. అలాగే బుద్ధుడు చెప్పింది కూడా చూద్దాం.

"న జచ్చా హోతి బ్రాహ్మణో" అంటే, "జన్మ ద్వారా ఎవ్వడు బ్రాహ్మణుడు కాడు" అని అర్థం. ఈమాటే గీతలో స్వామి వారు చెప్పింది చూద్దాం.

చాతుర్వర్ణం మయా సృష్టం
గుణకర్మవిభాగశః ।
తస్య కర్తారమపి మాం
విద్ధ్యకర్తారమవ్యయమ్ ।।
గీత 4- 13

జనుల గుణములు, కార్యకలాపముల ఆధారంగా, నాలుగు రకాల వృత్తి ధర్మములు నా చేత సృష్టించబడ్డాయి. ఈ వ్యవస్థకి నేనే సృష్టికర్త అయినా నన్ను అకర్తగా మరియు సనాతనునిగా తెలుసుకొనుము. అయితే ఈ రోజులలో వర్ణాల విషయంలో గాని, కుల ధర్మాల విషయంలో గాని ఎవరూ సరైన విధంగా అర్థం చేసుకోలేక, కేవలం జన్మతః వచ్చిందే వారి స్వధర్మంగా భావిస్తూ, భగవానుడు బోధించిన దానిని సరైన విధంగా అర్థం చేసుకోలేక పోతున్నారు.ఈ విషయంలో చాల సులభం గా అందరికీ అర్థం అయ్యే విధంగా బాబా వారు మనకు వారి

నడతలో చూపించారు అన్నది బాబా చరిత్ర చదివిన అందరికీ అర్థం అవుతుంది. ఈ వర్ణాలు ఎవరికి వారి స్వభావం అనుగుణంగా చేసినవే కానీ వారి పుట్టుకను బట్టి చేసినవి కావు అని సాక్షాత్తు బాబా వారి చరిత్ర ద్వారాకూడా మనం గ్రహించవచ్చు.

షిర్డీ బాబా తన నడత ద్వారా సహజ ధర్మమే స్వధర్మం గా మెలగమని, మనో వాక్కాయ కర్మల ద్వారా, త్రికరణ శుద్ధి గా కర్మలను ఆచరిస్తూ, మనం నడవవలసిన మార్గాన్ని చక్కదిద్దుకోమని సూచించారు. ధర్మం అనేది వేష భాషలపై లేదని, అది మన ఋజు ప్రవర్తన లో ఉండాలని సూచించారు. గీతలోని పై శ్లోకాలలో చెప్పిన విషయాల్ని ఆచరణలో చూపించి, మార్గ దిర్దేశం చేశారు మన బాబా.

అలాగే మతం, కులం వంటి భేదాలపై ఆధారపడిన విద్వేషాలను పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే సనాతన ఛాందస సంప్రదాయాలను, ఏ మతానివైనా గాని ఖండించారు. తాను ఫకీరుగా ఉన్నా తన అనుయాయులను సామాన్య గృహస్థ జీవనం గడపమని చెప్పారు. ప్రార్థన, భగవన్నామ స్మరణ, పుణ్యగ్రంధ పారాయణలను ప్రోత్సహించారు. ఖొరాన్ చదువమని ముస్లిములకూ, రామాయణం, భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం, జ్ఞానేశ్వరి, ఏకనాథ భాగవతం వంటివి పారాయణం చేయమని హిందువులకూ ఉపదేశించారు.

నీతి బద్ధమైన జీవనం గడపమనీ, ఇతరులను ప్రేమించి సహాయం చేయమనీ చెప్పారు. తన భక్తులకు రెండు ముఖ్యమైన లక్షణాలు అలవరచుకోమని పదేపదే చెప్పారు - అవి శ్రద్ధ (విశ్వాసం, భక్తి, దీక్ష), సబూరి (ఓర్పు, సాధన). నాస్తికత్వాన్ని తప్పు పట్టారు. అశ్రద్ధ చేయకుండా బాధ్యతలు నెరవేర్చాలనీ, వ్యామోహానికి లొంగకుండా ఉండాలని ఉపదేశించారు. "సర్వే పూర్ణాః శాశ్వతాశ్చ దేహాస్తస్య పరమాత్మనః" అంటుంది పద్మ పురాణం. దాని అర్థం "భగవంతుని యొక్క అన్ని అవతారములు ఆయన యొక్క అన్ని దివ్య శక్తులతో నిండి ఉంటాయి. అవన్నీ సంపూర్ణమైనవి, దోషరహితైనవి." అని. వ్యాసుల వారు వివరించిన దానిని బట్టి అవతారములు 1. ఆవేశావతారములు (నారదుడు) 2. ప్రాభవావతారాలు

(వ్యాసుడు) 3. వైభవావతారములు (మత్స్యావతారము) 4. పరావస్థావతారములు (రాముడు, కృష్ణుడు, బాబా ఇత్యాదులు) అని నాలుగు విధాలు.

ధర్మం-అధర్మం, ప్రేయో మార్గం-శ్రేయోమార్గం, నీతి - అవినీతి, మంచి-చెడు, మనిషి-మహిషి, దైవీగుణం-రాక్షస గుణం ఇత్యాదుల మధ్య తేడా తెలియని జనాలకి సరైన మార్గ నిర్దేశం చేసి వాళ్ళని ఆత్మోన్నతికి సన్నద్ధులం చేయడమే బాబా వారి అవతరణ ఉద్దేశ్యం గా మనం అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుడు తన గీత ద్వారా మనిషి ఎలా బతకాలో చెప్తే, షిర్డీ బాబా అలా ఎలా జీవించాలో ఆచరించి చూపారు.

బాబా నుడివిన తత్వాన్ని నిత్యజీవితంలో ఆచరిస్తే ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. జీవితం ధన్యమవుతుంది. ప్రవచనాలు చెప్పి ఊరుకోకుండా, స్వయంగా ఆచరించి చూపిన సద్గురువు మన బాబా. బాబా బోధనలు, వారి మాటలు మన హృదయమనే క్షేత్రంలో మొలిచిన దుష్టబుద్ధులు, చెడు లక్షణాలనే కలుపు మొక్కల్ని పెకిలించి వేస్తాయి అన్నది నిత్య సత్యం.

ఈ అధ్యాయంలో సాయిబాబా వారి గుణాలను వర్ణిస్తూ హేమాడ్ పంతు “శాంతియే వారి భూషణం. జ్ఞాన మూర్తి. ఉదార స్వభావి. నశించే వస్తువులపై అభిమానం లేనివారు. ఆత్మ సాక్షాత్కారం లో మునిగి ఉండి, లౌకికి వస్తువుల పట్ల అభిమానం లేని వారు" అని వర్ణిస్తాడు. ''మహామాయే విశ్వంభ్రమయసి పరబ్రహ్మ మహిషి' అంటుంది సౌందర్యలహరి. దీని ప్రకారం పరబ్రహ్మ పరమాత్మకు చలనము లేదు. దాని యందు ఏ వికారము వికారము జనింపదు. అది నిత్య సత్య వస్తువు. కేవల జ్ఞానానందాలే దాని రూపం.

దీని ద్వారా మనకు పరమాత్మ అంటే జ్ఞానముద్రతో విలసిల్లే పాణిపద్మము గలవాడనీ, కేవల ఆనందానికి మూలకందమైన వాడని తెలుస్తోంది. ఒక విధంగా ఇదే దక్షిణామూర్తి రూపం కూడా. ఈ లక్షణాలనే హేమాడ్ పంతు బాబాలో చూసి వర్ణించాడు. అటువంటి

మూర్తీభవించిన శాంత స్వరూప పరమాత్మ యొక్క భక్తులకు కూడా శాంతి చేకూరుతుంది అనడంలో సంకోచం అవసరం లేదు కదూ. అదెందుకో ముందుగా మన సాయి భగవానుడు కృష్ణుడుగా గీతలో చెప్పింది చూద్దాం.

భోక్తారం యజ్ఞతపసాం
సర్వలోకమహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం
జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ।।
గీత 5-29 ।।

సమస్త యజ్ఞములకు, తపస్సులకు భోక్తని నేనే అని, సమస్త లోకములకు అధిపతిని అని మరియు సర్వ ప్రాణుల యొక్క నిస్వార్థ మిత్రుడను అని తెలుసుకొనిన పిదప, నా భక్తుడు శాంతిని పొందును.

సమస్త ప్రాణులకూ తానే హితుడనని పరమాత్మ ఈ శ్లోకం ద్వారా స్పష్టంగా తెలిపాడు. ప్రత్యుపకారం ఆశించకుండా ఉపకారం చేసేవానిని సుహృత్ అంటారు. సకల జీవులకూ హితవు కల్గించడం భగవంతునికి స్వాభావికం. కానీ చాలామంది ఈ విషయాన్ని గమనించలేక, పరమాత్ముని విశ్వసించలేక దుఃఖనివృత్తి కోసం వేరే దారులు వెదుకుతుంటారు.

తాము కూడా ఆ భగవంతుని అంశ అని తెలియక మానవులు దుఃఖంలో కూరుకుపోతారు. పరమాత్మ రూపంలో తనలోనే ఉండే శాంతి, ఆనందాల గురించి తెలుసుకోలేక వాటి కోసం మనిషి బయట ఉండే భౌతిక వస్తువులలోఅన్వేషిస్తూనే ఉంటాడు.

'నన్ను భజించేవారి, శరణు జొచ్చిన వారి రక్షణ భారం నేనే వహిస్తా' నని అప్పుడు గీతాచార్యుడు, ఇప్పుడు బాబా వారు అభయమిచ్చారు. అందువల్లే సహజం గానే బాబా

వారి బోధలలో ప్రేమ, కరుణ, దానం, సంతృప్తి, శాంతి, దైవారాధన, గురుపూజ ముఖ్యంగా ఉండేవి. సాక్షాత్తు జ్ఞాన స్వరూపులైన స్వామికి జ్ఞానం భూషణం కాక మరేమవుతుంది.

ఇక వారి నశ్వర వస్తువులపై అభిమానం లేని తత్వాన్ని దర్శిద్దాం. అయితే అది అర్థం కావాలంటే మనం సదాశివ బ్రహ్మేంద్రుల వారు పరతత్వం ఏమిటో విశదీకరించిన వివరం చూడాలి.

నిరుపమ - నిత్య – నిరీహూ - నిష్కల - నిర్మాయ - నిర్గుణాకారః |
విగలిత సర్వ వికల్పః - శుద్ధో బుద్ధశ్చకాస్తి పరమాత్మా || 4

సాటిలేనిదై - నిత్యమై - ఏ కోరికలును లేనిదై - అఖండమై - మాయారహితమై - నిర్గుణమై - సంకల్పవికల్పములు లేనిదై - శుద్ధమై- జ్ఞానమయమై పరమాత్మస్వరూపము విరాజిల్లు చున్నది.
ఇది దక్షిణా మూర్తి తత్వం. ఇవే లక్షణాలని హేమాడ్ పంతు కేవల జ్ఞానానంద స్వరూపుడు, సాక్షాతూ దక్షిణా మూర్తి రూపుడు అయిన సాయిలో దర్శించి వర్ణిస్తున్నాడు తనకు తెలీకుండానే జ్ఞానానంద స్వరూపుడైన బాబావారి లక్షణాలని ఇక్కడ వర్ణించాడు. జ్ఞాన మూర్తి అయిన బాబానే వారితో అలా పలికించారు అన్నది గ్రహించగలం.

మాయా రహితుడు అని పేర్కొన్న తర్వాత ఇక భౌతిక వస్తువులపై ప్రేమ లేక పోవడం అన్నది సాధారణం గానే మనం భావించాలి. ఆత్మ-పరమాత్మ ల మధ్య సంబంధాన్ని వివరించే ఈ శ్లోకం మనం మన సాయి భగవానుడి నించి ఏది గ్రహించాలో మనకి బోధిస్తుంది.

స్వావిద్యైక నిబద్ధః కుర్వన్ కర్మాణి ముహ్యమానస్సన్ |
దైవా ద్విధూతబన్ధః స్వాత్మజ్ఞానాన్ముని ర్జయతి || 5
తన అజ్ఞానమే తన్ను కట్టి వేయగా మోహమగ్నుడై ఏవో కర్మలను ఆనచరించుచు, సంస్మరించుచున్న జీవుడు - దైవానుగ్రహముచే అజ్ఞానపాశము విచ్ఛిన్నముకాగా - 'ఇదిగో

! ఇదీ నేను!' అని అచ్ఛమైన తన రూపము నెరింగి, అందు నిలిచినవాడై (ఆత్మనిష్ఠుడై) మౌనియై విరాజిల్లు చున్నాడు.

ఇక్కడ గ్రహించాల్సింది ఏమిటంటే పరమాత్మ మాయాతీతుడు. జ్ఞాన మూర్తి. కానీ జీవుడు మాయా వశుడు. ఈ భేదం తొలిగిన నాడు ఆత్మ-పరమాత్మకు భేదం ఉండదు. ఇంతకు ముందు పేర్కొన్నట్లు అజ్ఞానమే బంధకారణము. ఈ తత్వము అర్థం చేసుకోవడం అంత తేలిక కాదు. పరమాత్మ ఎవనిని అనుగ్రహిస్తాడో వాడే ఈ మాయాబంధం నుండి బయట పడగలడు.

బాబా వారి ఆత్మ తత్త్వం లో మునిగి ఉన్న మూర్తిని దర్శించాడు కాబట్టే హేమడ్ పంతు ఆ విషయాన్ని వ్రాయగలిగాడు. అలా దర్శించ గలగడం కూడా బాబా వారి అనుగ్రహమే. అలా దర్శించ లేక పోవడం ఎందటో అజ్ఞానుల దురదృష్టం. ఈ విషయంలో గీతలో భగవానుడు చెప్పింది చూద్దాం.

నాహం ప్రకాశః సర్వస్య

యోగమాయాసమావృతః ।

మూఢోఽయం నాభిజానాతి

లోకో మామజమవ్యయమ్ ।।

గీత 7-25 ।।

నా యోగమాయా శక్తి ద్వారా కప్పబడి ఉన్న నేను అందరికీ వ్యక్తమవ్వను. కాబట్టి జ్ఞానము లేని వారు నేను పుట్టుక లేని వాడినని మరియు మార్పుచెందని వాడినని తెలుసుకోలేరు.

పై శ్లోకం లో చెప్పిన యోగ మాయ రెండు పనులు చేస్తుంది. భగవత్ కృపకు పాత్రులు కాని జీవాత్మలను భగవంతుడి నించి దూరం చేస్తుంది. అయితే శరణాగతి చేసిన జీవాత్మలకు తన కృప ప్రసాదించి, వారిని భగవంతుడికి చేరువగా తెస్తుంది.

శరణాగతి చేయని వారు మాయ ఆవహించగా ప్రాపంచిక సుఖాల వెంట, నశ్వర వస్తువులు, వ్యక్తుల వెంట పడి, భగవత్ కృపకు దూరమైపోతారు. ఎవరైతే భగవంతుడికి అనన్య శరణాగతి చేస్తారో వాళ్ళు ఆయన కృపాదృష్టి తో ఈ మాయ నించి రక్షింపబడి జనన మరణ చక్రం మరియు మాయ బంధం నుండి విముక్తి పొందుతారు.

తనకు తెలీకుందానే బాబా వారి లోని దక్షిణా మూర్తి తత్వాన్ని, శ్రీకృష్ణుల వారి దైవీ సంపత్తిని, బాబా లోని శాంతి స్వరూపాన్ని దర్శించి, సాధారణ పరిభాషలో వ్యక్తీకరించిన హేమాడ్ పంతు లా మనం కూడా బాబాకు శరణాగతి చేసి, వారి కృపా దృష్టికి పాత్రులం అవుదాం.

సాయి బాబా ఎల్లప్పుడూ అల్లాహ్ నామమును ఉచ్చరించు వారు. ప్రపంచం అంతా మేలుకొన్నప్పుడు వారు యోగ నిద్రయందు ఉండెడి వారు. లోకము నిద్రించినప్పుడు వారు మెళుకువ తో ఉండెడి వారు. ఒక చోటనే కూర్చున్నప్పటికీ ప్రపంచము నందలి అన్ని విషయములు వారికి తెలియును. నిత్యమూ వందల కొలది కథలు చెప్తున్నా మౌనము తప్పెడి వారు కాదు.

ఈ మాటలు హేమాడ్ పంతు బాబా గారిని వర్ణిస్తూ చెప్పినవి. ఇదే తత్వాన్ని మహా యోగికి అన్వయిస్తూ గీత చెప్పినది చూద్దాం.

యా నిశా సర్వభూతానాం

తస్యాం జాగర్తి సంయమీ I

యస్యాం జాగ్రతి భూతాని

సా నిశా పశ్యతో మునేః II

గీత 2-69 II

సర్వ భూతములకు ఏది పగలో అది పండితునికి అజ్ఞానపు రాత్రి, మరియు సర్వ భూతములకు ఏది రాత్రియో అది అంతర్ముఖులైన జ్ఞానులకు పగలు.

లౌకిక దృక్పథం లోనే ఉండేవారు భౌతిక వస్తు, విషయముల భోగమే నిజమైన జీవిత పరమార్థం అనుకుంటారు. ప్రాపంచిక విలాసాల ఆనందమే జీవితంలో విజయమనుకుంటారు అంటే "పగలు"; ఇంద్రియ సుఖాలు లేకపోవడమే చీకటి అంటే "రాత్రి" అనుకుంటారు. మరో పక్క, దివ్య జ్ఞానం తో అయిన వివేకవంతులు, ఇంద్రియ భోగాలని, ఆత్మకి హానికరమైనవిగా తెలుసుకుని, వాటిని "రాత్రి" (చీకటి) గా పరిగణిస్తారు.

ఈమాటలు అన్నది కృష్ణుడు అయితే, దానిని నిజ రూపం లో తన ముందు ప్రత్యక్షం అయినప్పుడు దర్శించుకున్న భీష్ముడు ఈ హేమడ్ పంతు. ఈ మాటలు తన ద్వారా పలికించి మనకు అంతర్ముఖులమై ప్రాపంచిక సుఖాల వైపు మొగ్గు చూపవద్దు అని బోధించారు బాబా. కాపోతే ఈ మనసు ఒక కోతి వంటిది. ఒక్క క్షణం కూడా ఏ ఆలోచన చేయకుండా ఉండదు. అటువంటి మనసుకు ఏదో ఒక ఆలంబన ఉంటే దానికే అల్లుకుంటుంది. ఆ ఆలంబన భగవన్నామం అని బాబా వారు మనకు 'అల్లాహ్ మాలిక్' అంటూ సూచించారు.

ఎప్పుడైతే మనసు భగవత్ సాన్నిధ్యం వైపు మొగ్గి, ఆయన సర్వవ్యాపకత్వాన్ని అర్థం చేసుకుని, ఆయనకు శరణాగతి చేస్తుందో అప్పుడు సర్వాంతర్యామి తత్త్వం కూడా అర్థం అవుతుంది. సర్వాంతర్యామి తత్త్వం ఏమిటి అంటారా.

భగవంతుడే అందరినీ సృష్టించే వాడు. అందరినీ పాలించేవాడు. అందరినీ సంహరించేవాడు కూడా ఆయనే. కాని ఆయనకు ఎటువంటి మలినము అంటదు. అటువంటి భగవంతుని చేత సృష్టించబడిన మానవులు బంధాలలో బందీలౌతారు. రాగాలలో కూరుకుపోతారు. వారంటే అభిమానం, వీరంటేఇష్టం అంటూ వారిపై మమకారాన్ని పెంచుకుని అందునుండి విడవడానికి నిస్సహాయులౌతారు. అందుకే మానవులకు సుఖదుఃఖాలు కలుగుతుంటాయ. కాసేపైనా బంధం లేకుండా మనిషి జీవించలేడు. నాకు ఎవరూ లేరనే చింతలో కొట్టుకుని పోయి పిచ్చివానిగా మారుతుంటాడు.

జిజ్ఞాసువు, జ్ఞానులు మాత్రం అందరినీ సమానంగా చూస్తారు. అందరితోను మిత్రత్వాన్నే కలిగిఉంటారు. అందరియెడ సమభావాన్ని చూపిస్తారు. అందరినీ చిరునవ్వుతోనే పలుకరిస్తారు. కాని వారిపై ఎటువంటి మమకారాలను పెంచుకోరు. కనుక వారుబంధితులుకారు. అట్టివారు భగవంతునికి దగ్గరవారవుతారు.

అందువల్లే బాబా వారు మన ముందు ఉంటూ, మనకు ఆచరించి, బోధించి, ఎన్నో కధలను చెప్తూనే, దూరంగా ఉన్న ఎందరి కష్టాలనో గ్రహించి, వారిని ఆపత్తుల నించి కాపాడుతూనే ఉన్నా, తానూ మాత్రం ఎప్పుడూ మౌనంగా ఉంటూ, శాంతిని ప్రబోధిస్తూ, మనల్ని కూడా భగవన్నామం అనే సాధన తో తరించమని ఆచరించి చూపారు.

ఇంకా హేమాడ్ పంతు అంటాడు "బాబా వారు ఎల్లప్పుడు ఆత్మధ్యానమందే మునిగి ఉంది, సిద్ధ పురుషుడైన కూడా సాధకుడిలా కనిపించే వారు. అణుకువ, నమ్రత కలిగి, అహంకారం లేక అందరినీ ఆనందింప చేయువారు".

ఇక్కడ అహంకారం అన్నదానిని వదలడం ఎందుకు ప్రాధాన్యతని సంతరించు కుంటుందో అర్థం చేసుకోవాలి. అహంకారం ప్రబలినప్పుడు మంచిచెడ్డలు బుర్రకెక్కవు. అహంకారంతో, ఆవేశంతో చేసే పనులు మంచి ఫలితాలనివ్వవు. అహంకారాన్ని అదుపులో ఉంచుకోగలిగితే తప్పు ఒప్పులు ఎవరికి వారికే అవగతమవుతాయి. తర్వాత నిదానంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే సత్ఫలితాలు కలుగుతాయి.

అహంకారాన్ని అదుపులో ఉంచుకోవాంటే ఒకటే మార్గం. భగవధ్యానం. భగవంతుని మీద పూర్తిగా మనసుని లగ్నం చెయ్యగలిగినప్పుడే అహంకారం అదుపులో ఉంటుంది. మనసు ప్రశాంతత పొందుతుంది. అందుకే బాబా వారు మనకు అల్లాహ్ మాలిక్ అంటూ నిరంతర ధ్యానం లో ఉంటూ మనకు మార్గాన్ని సూచించారు.

దాసగుణ్ నామ సప్తాహం చేసినప్పుడు బాబా వారు "భక్తుడు భగవంతుడిని ప్రేమతో కీర్తిస్తే ఆయన అక్కడే అవతరిస్తాడు" అని బోధించారు. ఇందులో భక్తీ యొక్క ప్రాధాన్యత ను బాబా వారు చాల సూక్ష్మం గా బోధించారు.

మానవుల దేహంలో ఉండే చైతన్యము తానే అని బాబా వారు ఇంతకు ముందు అధ్యాయాలలో చెప్పారు. ఆ సందర్భంగా విశదపరచిన దక్షిణామూర్తి స్తోత్రంలో కూడా "నానా ఛిద్ర ఘటోదర స్థిత మహాదీప ప్రభా భాస్వరం, జ్ఞానం యస్యతు చక్షురాది కరణ ద్వారా బహు స్పందతే' అన్న స్తుతి ద్వారా "చాలా చిల్లులున్న కుండలో నుండు దీపకాంతులు ఎలా ఆ చిల్లుల ద్వారా బయటకు వస్తాయో, ఆ విధంగానే, మన శరీరమందుగల నవరంధ్రముల ద్వారా చైతన్యస్ఫూర్తి, జ్ఞానము బయటకు ప్రసరించునని తెలియపరుస్తోంది. అంటే అంతర్యామి గా ఉన్న ఆ పరమాత్మే ప్రకాశం, జ్ఞానం, శక్తి, విద్య.

అటువంటి స్వామి ఎక్కడో కాదు, నీలోనే అంతర్గతం గా ఉన్నాడు అని తత్-త్వం-అసి (తత్త్వమసి) అని మహామంత్రం బోధిస్తుంటే, దాన్నే మన బాబా వారు 'అల్లాహ్ మాలిక్' అంటూ ఎప్పుడూ ఆ అంతర్గత స్వామిని తలుస్తూ ఉండమని బోధించారు.

ఇక భక్తి యొక్క ప్రాధాన్యత విషయానికి వస్తే శృతి, స్మృతి, పురాణాలు, వేద వాంజ్మయాలు మనకి దాని మహత్తుని వేనోళ్ళ పొగిడాయి అన్నది సాధకులకు అవగతమే. అయినా కొంత పరికిద్దాం.

మనోధృతిర్ధారణా స్యాత్ సమాధిర్బ్రహ్మణి స్థితిః|
అమూర్తో చేత్ స్థిరా న స్యాత్ తో మూర్తి విచింతయేత్||

మనస్సు యొక్క నిశ్చలత్వం ధారణ అనబడుతుంది. ఆ భావంలో తాదాత్మ్యం చెందడం సమాధి అనబడుతుంది.
అయితే ఇదంతా సాధించాలి అంటే ముందు మనస్సు స్థిరంగా ఉండాలి. ఈ మనస్సు ఎలాంటిదో సాక్షాత్తూ శ్రీకృష్ణుల వారి మాటల్లో విని, దానికి మన బాబా ఇచ్చిన విరుగుడు చూద్దాం.

అసంశయం మహాబాహో

మనో దుర్నిగ్రహం చలమ్ ।

అభ్యాసేన తు కౌంతేయ

వైరాగ్యేణ చ గృహ్యతే ।।

గీత 6 - 35

శ్రీ కృష్ణ పరమాత్మ అన్నాడు: ఓ మహా బాహువులు కల కుంతీ పుత్రుడా, నీవు చెప్పింది నిజమే; మనస్సు అనేది నిగ్రహించటానికి నిజముగా చాలా కష్టమైనది. కానీ, అభ్యాసము మరియు వైరాగ్యములచే దానిని నిగ్రహించవచ్చు.

మనస్సు పై నియంత్రణ కష్టమే అని అందరికీ తెలుసు. దాన్ని శ్రీకృష్ణుల వారు గాని, బాబా వారు గాని ఎక్కడా కొట్టేయలేదు. మన స్థాయిని గురించి ఆలోచించే వారు మనకు ఆచరణ యోగ్యమైన మార్గాన్నే ప్రతిపాదించారు.

"అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః" అని (యోగ దర్శనం 1.12) లో చెప్పినట్లుగా "నిరంతర అభ్యాసము, వైరాగ్యముల ద్వారా మనస్సు యొక్క ఆందోళనలను నియంత్రించవచ్చు." అని ఇరువురూ బోధించారు.

దానికి నాంది ప్రస్తావనగా ముందుగా శ్రీకృష్ణుడు బోధించినది చూసి, అది బాబా వారి మాటల్లో చూద్దాం.

పార్థ నైవేహ నాముత్ర

వినాశస్తస్య విద్యతే ।

న హి కల్యాణకృత్కశ్చిత్

దుర్గతిం తాత గచ్ఛతి ।।

గీత 6- 40

ఓ పార్థా! ఆధ్యాత్మిక పథంలో ఉన్న వాడు ఈ లోకం లో కాని, పర లోకంలో కాని చెడిపోడు. ప్రియ మిత్రమా, భగవత్ ప్రాప్తి కోసం ప్రయత్నం చేసే వాడు ఎన్నటికీ దుర్గతి పాలుకాడు.

అంటే ఎవరైతే ఆధ్యాత్మ పదంలో ఉంటూ, మనస్సు పై నిగ్రహాన్ని అభ్యాస పూర్వకంగా సాధన చేస్తూ, ఎప్పుడో తమ నాలుకపై భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ, తమ పనులను మనసా-వాచా-కర్మణ ఎటువంటి ప్రయత్నలోపం లేకుండా చేసి, ఫలితానికి ఆశించకుండా, దాని ప్రతిఫలాన్ని కూడా భగవదర్పితం చేస్తూ, తమ యొక్క కర్మని (ఏదైతే ఫలాన్ని తెచ్చిపెడుతుందో) అకర్మ గా (ఏ ఫలం లేకపోవడం తో ఎటువంటి బంధాన్ని కలిగించని) మార్చుకుని, సర్వ భూత దయ, హితం కోరుకుంటూ, పరుల కష్టాన్ని తన కష్టంగా, పరుల సంతోషాన్ని తన సంతోషంగా భావిస్తూ, అందరిలోనూ తనను, తనని అందరిలోనూ చూసుకుంటూ, ఒక విధంగా అందరిలోని అంతర్యామిని దర్శిస్తూ, ఆ అంతర్యామికి ప్రణతులు అర్పిస్తూ జీవనాన్ని సాగిస్తూ ఉంటాడో, ఆ దిశగా చేసే చిన్న సాధన లేదా ప్రయత్నం కూడా వ్యర్థం కాక, ఆ సాధకుడిని మరింత ఉజ్వల స్థితికి తీసుకుని వెళ్లి, సద్గతిని కరతలామలకం చేస్తుంది అని పై మాటల ద్వారా తెలుస్తోంది.
ఇంతటి గూఢమైన జగద్గురు బోధని మన బాబా చాల సరళంగా 'అల్లా మాలిక్' అంటూ ఎప్పుడూ ఆ భగవంతుడిని తలుచుకుంటూ, మన కర్మలను, వాటి మంచి లేదా చెడు ఫలితాలను కూడా జ్ఞాన (ధుని) లో వేసి, తరించమని బోధించారు. అయితే ఇన్ని మార్గాలను ఆచరించడం ఒక్కో సారి కష్టం అని తోచి, ఆ దారిలో అడుగు పెట్టడానికి కూడా చాల మంది సాహసించక, తమ సాధనని పక్కకి పెట్టవచ్చు. అలాంటి వారికి కూడా తరించే మార్గాన్ని దరిచేరుస్తూ శ్రీ కృష్ణుల వారు, బాబా వారు బోధించిన మార్గాన్ని చూసేముందు ఆదిశంకరులు బోధించిన సూత్రాన్ని చూద్దాం.

సత్సంగత్వే నిస్సంగత్వం! నిస్సంగత్వే నిర్మోహత్వం!
నిర్మోహత్వే నిశ్చలత్వం! నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః!

సత్సాంగత్యం వల్ల అసంగత్వం ఏర్పడి మోహం, భ్రాంతి తొలగిపోతాయి. అప్పుడే మనసు నిశ్చలమై ముక్తి లభిస్తుంది.

భగవశ్చింతనవల్ల సద్భక్తుల సహవాసం లభించింది. ఆ సహవాసం ముక్తికి సోపానమై, జన్మ చరితార్థమవుతుంది. సత్కర్మాచరణ, సత్యనిష్ఠ, సాధుసత్పురుషుల సాంగత్యం వల్ల మోహం నశించి ఆత్మ నిరంతరం చైతన్యాత్మలో సంగమిస్తుంది. పెడదారి పట్టిన మనస్సును సరిదిద్దే గొప్ప అవకాశం సత్సంగత్వం. సత్సాంగత్యం వల్ల మోహం, భ్రాంతి నశిస్తాయి. మనస్సు నిర్మోహమై, నిశ్చలమవుతుంది. అంతఃకరణ శుద్ధమై, పరమాత్మకు నిలయమవుతుంది. అప్పుడే జీవన్ముక్తి అంటుంది ఆదిశంకరుల 'భజగోవింద స్తోత్రం' . ఈ విషయం లో మరింత వివరంగా తెలుసు కుందాం.

భక్తుడు భగవంతుడడిని ప్రేమతో కీర్తిస్తే ఆయన అక్కడే అవతరిస్తాడు అని సాయి సచ్చరిత్ర నాలుగవ అధ్యాయ ప్రారంభంలో చెప్పబడింది. గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడిని అతని బుద్ధిని తనకు అర్పించి, మనస్సుని అనన్య ప్రేమయుక్త భక్తి తో తన యందే లగ్నం చేయమని బోధిస్తాడు.

బాబా వారు చెప్పినదాన్ని అప్పుడు శ్రీకృష్ణుడు చెప్పిన మాటల్లో చూద్దాము.

యే త్వక్షరమనిర్దేశ్యం
అవ్యక్తం పర్యుపాసతే |
సర్వత్రగమచింత్యం చ
కూటస్థమచలం ధ్రువమ్ || 3 ||

సన్నియమ్యేంద్రియగ్రామం
సర్వత్ర సమబుద్ధయః |
తే ప్రాప్నువంతి మామేవ
సర్వభూతహితే రతాః || గీత 12 ౩-4 ||

నాశరహితుడూ, అనిర్వచనీయమైన వాడు, అవ్యక్తమూ, సర్వవ్యాపి, మనోబుద్ధులకు అతీతుడు, మార్పు లేనివాడు, నిత్యశాశ్వతుడూ మరియు నిశ్చలమైన వాడునూ - అయిన పరమ సత్యము యొక్క నిరాకర తత్త్వాన్ని - ఇంద్రియములను నిగ్రహించి, సర్వత్రా సమబుద్ధి తో ఉంటూ, సర్వభూతముల సంక్షేమం కోసం నిమగ్నమై ఉంటూ - ఆరాధించేవారు కూడా నన్ను పొందుతారు.

ఒక రకంగా చూస్తే "నాకు జనులు ఏ రకంగా శరణాగతి చేస్తారో వారికి నేను అదే ప్రకారంగా ప్రతిస్పందిస్తాను" అని చెప్తున్నారు. సమస్తమూ భగవంతుడి నుండే ఉద్భవించాయి అన్న విషయం తెలుసుకున్నవారు ఆయన పట్ల భక్తితో ధృఢ విశ్వాసంతో నిమగ్నమౌతారు. ఆ జ్ఞానం పొందిన భక్తులు భగవంతుడి మహిమల గురించి చర్చిస్తూ, ఇతరులకు ఆయన గురించి తెలియచేస్తూ ఎంతో తృప్తిని అనుభవిస్తారు. వారి మనస్సులు ఆయనతో ఏకమై పోవటం వలన, వారి హృదయములోనే వసించే భగవంతుడు, వారికి దివ్య జ్ఞానము అనుగ్రహిస్తాడు, దానిచే ఆయనను వారు సునాయాసముగానే పొందుతారు.

ఇక్కడ మనం ముఖ్యంగా తెలుసుకోవాల్సిన ఇంకో శ్లోకం ఇలా ఉంది.

యో మామజమనాదిం

చ వేత్తి లోకమహేశ్వరమ్ ।

అసమ్మూఢః స మర్త్యేషు

సర్వపాపైః ప్రముచ్యతే ।।

గీత 10 - 3 ।।

నేను జన్మరహితుడను మరియు ఆది(మొదలు) లేనివాడిని అని మరియు సర్వ లోక మహేశ్వరుడను అని తెలుసుకున్న మనుష్యులు మోహమునకు గురికారు మరియు వారు సమస్త పాపముల నుండి విముక్తి చేయబడుతారు. ఇక్కడ మనం గ్రహించాల్సినది ఏమిటంటే "భగవంతుడు సమస్త ఈశ్వరులకే ఈశ్వరుడు; ఆయనే సర్వ దేవతలకు దేవుడు.

అందరు ప్రియమైన వారికి ప్రియమైనవాడు; ఆయనే ఈ జగత్తుని ఏలేవాడు, మరియు భౌతిక ప్రకృతి శక్తికి అతీతమైనవాడు"

జన్మ కర్మ చ మే దివ్యమ్

ఏవం యో వేత్తి తత్త్వతః ।

త్యక్త్వా దేహం పునర్జన్మ

నైతి మామేతి సోఽర్జున ।।

గీత 4 - 9 ।।

నా యొక్క జన్మ మరియు కర్మల దివ్య స్వభావాన్ని ఎవరైతే అర్థంచేసుకుంటారో, ఓ అర్జునా, వారు తమ దేహం విడిచిపెట్టిన తరువాత తిరిగి జన్మనెత్తరు, నా నిత్యశాశ్వత ధామానికే వస్తారు.

ఈ పై శ్లోకాలన్నిటి సారాంశాన్ని బాబా వారి దయతో పూర్తిగా అనుష్ఠాన పరంగా సొంతం చేసుకున్న హేమాడ్ పంతు మనకు అర్థమయ్యే విధంగా "భక్తుడు భగవంతుడిని ప్రేమతో కీర్తిస్తే ఆయన అక్కడే అవతరిస్తాడు" అని సూక్ష్మంగా వివరించాడు.

ఇక్కడ బాబా బోధన, శ్రీకృష్ణుల వారి గీతను అనుసంధానిస్తే మనకు అర్థం అయ్యేది ఏమిటంటే ఎప్పుడైతే మనం ఆయన భగవంతుడి తత్త్వాన్ని తెలుసుకుంటామో అపుడు మన మన సర్వేంద్రియాలు ఆయనలో లయమై, వారి అన్ని విభూతులను మనం అర్థం చేసుకోగలుగుతాము.

ఆ స్థితికి చేరిన నాడు మనకు తత్త్వమసి భావన అవగతమై, భగవంతుడి విభూతులు, అవతారాలు అన్ని విధాలుగా అంతటా మనకు దర్శనమిస్తాయి. తననే శరణు కోరి, తనకే అంకితమై, తననే అర్చించి, తనకి దాసోహం అయి, తనలో మనలను, మనలను ఆయనను చూసుకున్న నాడు, ఆ భగవంతుడికి, దరిచేరిన భక్తుడికి ఉన్న దూరం సమసి పోయి,

ఆర్తత్రాణ పరాయణుడైన ఆ స్వామిని ప్రతీ క్షణం భక్త పరిరక్షణకు అవతరించేలా ఆయనను బందీని చేస్తాయి.

అది మనకు ప్రహ్లాద చరిత్రలోనూ, గజేంద్రమోక్షం లోనూ, మరెన్నో భాగవత కధలలోనూ తెలుస్తూనే ఉంది. అదే విషయాన్ని చాల సూటిగా మనకు బాబా వారు హేమాడ్ పంతు మాటల్లో తెలియ చేశారు. మరి ఆయనను మనం పిలిస్తే పలికే స్థితికి ఎలా చేరుకోవచ్చో తెలుసుకుందాం.

ప్రయాగ వెళ్ళి సంగమంలో స్నానం చేయాలన్న కోరికను దాసగణు తెలిపినప్పుడు బాబా వారు "అంత దూరము పోనవసరం లేదు. మన ప్రయాగ ఇచ్చటనే కలదు. నా మాటలు విశ్వసింపుము" అని చెప్పడం చూశాము.

ఆ స్థితిని చేరడానికి మానవుడు ఏమి చెయ్యాలి అన్న దానికి గీత లోని నాలుగ శ్లోకాలు ముఖ్యంగా మనం చూడాలి. అది ఒక విధంగా బాబా వారు నుడివిన మార్గమే అని ముందు ముందు మీరే గ్రహిస్తారు.

నాహం వేదైర్న తపసా

న దానేన న చేజ్యయా ।

శక్య ఏవంవిధో ద్రష్టుం

దృష్టవానసి మాం యథా ॥

గీత 11 - 53 ॥

శ్రీ భగవానుడు పలికెను: వేదాధ్యయనము వలన కానీ, తపస్సులవలన కానీ, దానధర్మాల వలన కానీ లేదా యజ్ఞముల వలన కానీ, నేను, నీవు ఇందాక చూసినట్టుగా కనిపించను.

ఇక్కడ మనం మన బాబా వారు ప్రత్యేక పూజ విధానాలనో, వేద మంత్రాలనో కాకా, కేవలం శిక్ష-సబూరి అన్న రెండు ఆత్మ సమర్పణ భావ కుసుమాలతో తనని ప్రార్ధిస్తే చాలు, వారిని ఎప్పుడూ కాపాడుతాను అని తెలిపిన వైనం అర్ధం అవుతోంది కదా.

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన
ప్రవేష్టుం చ పరంతప ॥
గీత 11 - 54 ॥

ఓ అర్జునా, అనన్యమైన భక్తి చేత మాత్రమే నేను నీ ముందే నిల్చుని ఉన్న నన్నుగా యదార్ధముగా తెలుసుకోబడుతాను. ఓ పరంతపా, అందువలన నా దివ్య దృష్టిని పొందిన పిదప నాతో ఏకీభావ స్థితిని పొందవచ్చు.

ఈ అధ్యాయ ప్రారంభం లో చెప్పినదే మళ్ళీ వివరిస్తూ భక్తీ యొక్క ప్రాదాన్యత ద్యోతకం ఔతోంది. స్వామిని చూచుటకుగాని తెలసికొనుటకుగాని, ఆయనలో నిమగ్నం కావడానికి గాని, లయం కావడానికి గాని నిశ్చలభక్తి తప్ప వేరు సాధనములు లేవు అని తెలుస్తోంది.

అనన్యచేతాః సతతం
యో మాం స్మరతి నిత్యశః ।
తస్యాహం సులభః పార్ధ
నిత్యయుక్తస్య యోగినః ॥
గీత 8 -14

ఓ పార్థా, అనన్య చిత్తముతో నన్నే ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండే యోగులకు, నేను సులభముగానే దొరుకుతాను ఎందుకటే వారు నిరంతరం నా యందే నిమగ్నమై ఉంటారు కాబట్టి.

ఈ అనన్య చింతన అనేది ఎలా ఉండాలో మనకి భాగవతం లో ప్రహ్లాద కుమారుడు తన నడతలో సూచిస్తాడు.

పానీయంబుల ద్రావుచుస్, గుడుచుచుస్, భాషింపుచుస్, హాసలీలా నిద్రాదులు సేయుచుం, దిరుగుచుస్, లక్షించుచుస్, సంతత

శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా !

అదెలా అంటే ప్రహ్లాదుడు అన్నము తింటూ నీళ్ళు త్రాగుతూ మాట్లాడుతూ నవ్వుతూ వినోదిస్తూ నిద్రపోతూ కాని ఎప్పుడైనా సరే ఏమరుపాటు లేకుండా శ్రీ హరి ధ్యానంలోనే నిమగ్నమైన చిత్తము కలిగి, ఈ ప్రపంచమును మరచిపోయి ఉంటాడు.

అంతలా అనన్య భక్తి చూపాడు కనుకే ఆ ప్రహ్లాద కుమారుడు భావించిన విధంగా ప్రత్యక్షం అయ్యాడు. అదెందుకో కూడా గీత లోనే చూద్దాం.

మాం చ యోఽవ్యభిచారేణ

భక్తియోగేన సేవతే ।

స గుణాన్ సమతీత్యైతాన్

బ్రహ్మభూయాయ కల్పతే ।।

గీత 14 -26 ।।

నిష్కల్మషమైన భక్తి ద్వారా నన్ను సేవించిన వారు ప్రకృతి త్రిగుణములకు అతీతులై పోవుదురు మరియు బ్రహ్మం స్థాయికి చేరుతారు.

అంటే అనన్య భక్తి తో అర్చించిన వాడు త్రిగుణాలను అతిక్రమించి ముక్తిని పొందుటకు సమర్థుడు ఔతాడు. అయితే ఇవన్నీ ఖచ్చితంగా మన ముందు జరిగినా ఆ లీలలను గ్రహించే శక్తి మనకి ఉండాలిగా. అంతలా శ్రీకృష్ణుడు తమ ముందున్నా ఆయనలోని దివ్యత్వాన్ని గ్రహించని దుష్ట చతుష్టయం, అలాగే మన బాబా అన్ని మహిమల్ని చూపిస్తున్నా వాటిని తోసిపుచ్చిన కొందరు సమకాలీకులను మనం చూస్తూనే ఉన్నాం కదా. మరి ఆ దివ్యత్వం అర్థం కావాలన్నా, ఆ అనుభవం మనకి కూడా కలగాలి అన్నా మనం ఏమి

సాధించాలి. దాసగణు స్థాయికి ఎదగాలి. అదెలా అంటారా. దానికి భాగవతం ఒక మార్గం చూపింది.

ఇంచుకమాయ లేక మదినెప్పుడు జడు బాయని భక్తితోడ వ
ర్తింపుచు నెవ్వడేని హరిదివ్య పదాంబుజ గంధారసి సే
వించు, నతం డెరుంగు నరవింద భవాదులకై దుర్లభో
దంచితమైన యాహరి యుదార మహాద్భుత కర్మమార్గముల్!

మర్మము అన్నది కొంచం కూడ లేకుండ, ఎడతెగని భక్తితో ప్రవర్తిస్తూ, నారాయణ చరణారవింద సుగంధాన్ని సేవించే మహాత్ముడు, బ్రహ్మాదులకు సైతం అందుకొన శక్యం కాని భగవంతుని అత్యద్భుతమైన లీలావిశేషాలను తెలుసుకొంటాడు.

బాబావారు దాసగణు కోరిన ప్రయాగ ని అక్కడకే తెప్పించారు అంటే దానికి కారణం బాబా నుడివిన మార్గాన్ని తూ.చ. తప్పకుండా పాటించిన దాసగణు కర్మమే. తన కోరికలో (1) మర్మం కొంత కూడా లేదు. ఏదో సాధించాలని కాదు. కేవలం ఆ స్వామిని దర్శించు కోవాలనే తపన తప్ప. (2) ఎడతెరగని భక్తిని ప్రదర్శించాడు కాబట్టే బాబా తనని విడువ లేదు. (3) బాబా వారు పాద స్మరణ ని ఎన్నడూ మరువ లేదు. అందువల్లే ఎందరికో దక్కని బాబా దర్శన, స్పర్శన, బోధన భాగ్యాన్ని కరతలామలకం చేసుకున్నాడు.

ఇక్కడ మనం తెలుసుకోవాల్సింది బాబా బోధలోని మర్మం. అదే అనన్య భక్తి. అది సాధించనిది ఏదీ లేదు. ఎందుకంటే అనన్య భక్తిలో మునిగిన భక్తుడు తనకై వ్యక్తిగతంగా కోరుకునే కోరిక ఏదీ ఉండదు. తను ఏది కోరినా అది లోక క్షేమమే, పది మందికి ఉపయోగపడే విశిష్ఠ కార్యమే. ఇంతటితో ఈ అధ్యాయ అంతరార్ధ పరిశీలనను ముగిద్దాం.

## 4వ అధ్యాయం సంపూర్ణం